# జూజూ జిందాబాద్

అదొక పెద్దమేడ. ఆ మేడముందు ఒక నల్ల కారు. చుట్టూ పూలతోట. ఆ ఇంట్లో ఒక బొచ్చుకుక్క.

ఆ మేడెదుట చిన్న గుడిసె. గుడిసె ముందు కుక్కిమంచం. మంచం క్రింద నల్లకుక్క.

బొచ్చుకుక్కను చూస్తే నల్లకుక్కకు ఒళ్ళుమంట. తనకంట పడగానే భొయ్‌మని లేస్తుందది. తనది మేలుజాతని దాని గర్వం. కోరినవంటకాలు అది కోరకుండానే ఎన్నో హంగులతో దానికి అమరుతూ ఉంటాయి. ఇంటిముందు వరండాలో కూర్చున్నా, పైన బాల్కనీలో కూర్చున్నా తీవిని ఒలకబోస్తూ ఉంటుందది. పేరుకూడా దాని హొయలుకు తగినట్లే ఉంది. సీజరట సీజరు. నల్లకుక్క కోపంగా మూల్గి మూతిత్రిప్పుకొంది.

నల్లకుక్కను చూస్తే సీజరుకు లెక్కలేదు. తను కార్లో షికారు వెళ్తున్నప్పుడు సాయంకాలాన నౌకరుతో వ్యాహ్యాళికి వెళుతున్నపుడు చూసీ చూడనట్లు వాళ్ళింటివేపు చూస్తుంది. అది మట్టిలో ఆడుకుంటూనో, ఎంగిలిమెతుకులు ఏరుకుంటూనో కనిపిస్తుంది. అప్పుడు ఛీత్కారంచేసి సీజరు మొహం త్రిప్పుకొంటుంది. నల్ల కుక్కకూ ఒక పేరుందేమో తెలీదు. ఆ ఇంట్లోని ముసలాడు “జూజూ” అని కాబోలు పిలుస్తూ ఉంటాడు.ఆ ముసలాడుకూడా సీజరుండే ఇంట్లో పనిచేస్తూ ఉంటాడు.

ఒకరోజు జూజూ తన యజమానితోపాటు ఎదురింట్లో అడుగుపెట్టింది. సీజరు అప్పుడే బ్రెడ్‌ముక్కలు, ఉడకబెట్టిన గ్రుడ్డుతిని పాలు త్రాగుతోంది. ప్రొద్దున్నే యజమానిచద్దన్నం

తింటూ పడేసిన రెండు ఎంగిలి ముద్దలు మాత్రం తినివచ్చిన జూజూకు నోట్లో నీళ్ళూరాయి. సీజరు తింటున్న పింగాణి గిన్నె ప్రక్కన పడివున్న నొక బ్రెడ్డు ముక్కను ఆశకొద్దీ నోట కరచుకోబోయింది. సీజరు రాక్షసిలా దానిమీద పడింది. ఇంట్లోని నౌకరు ఒకడు కర్రను జూజూపైకి విసిరాడు. కుయ్యోమంటూ కుంటికాలితో పరుగెత్తింది జూజూ. దాని యజమానికి చడామడా చీవాట్లు తగిలాయి.

అప్పటినుండి జూజూకు సీజరుపై పగ రగలసాగింది. తామందరూ ఒకే జాతికి చెందినవారే. అందరూ యజమానులకు సేవచేసి బ్రతుకుతున్నవాళ్ళే. కాని కొన్ని కుక్కలకు రాజభోగం మరికొన్నింటికి ఆకలి బ్రతుకులు ఎందుకేర్పడ్డాయో! తానైనా సీజరుకు ఎక్కువయి పోయిన ముక్కనే నోట కరచిందిగాని దాని పళ్లెంలో చొరబడి తినలేదే.

రెండునాళ్ళ తరవాత - జూజూ కుంటుకొంటూ ఆ మేడముందు పోతూ ఉండగా పైన బాల్కొనీలో కూర్చుని ఇంటి వారమ్మాయి పెట్తున్న బిస్కట్లు మెక్కుతున్న సీజరు భౌయ్, భౌయ్ మని గొంతు చించుకొని అరవసాగింది. జూజూకు ఒళ్ళు మండింది. తనమానాన తను తలవంచుకొని వీధివారగా నడుస్తుంటే దాని సొమ్మేంపోయింది? ఆ వీధంతా దానితాతగారిదా? జూజూ మూలుక్కుంటూ ఇంకొక సందులోకి మళ్ళింది. ఏం మాయదారి కాలమొచ్చింది! కుక్కలకూ, కుక్కలకే పడకుండా పోయింది. అంతా ధనమదం, హోదా. తనకు సుష్టుగా దొరికితేచాలు క్రిందవాళ్ళపైన హుకుం చెలాయించే హక్కు దానంతటదే వస్తుంది కాబోలు.

ఇంతలో ఒక కుర్రాడు ఏదో బొక్కుతూ పోవటం జూజూ కంటబడింది. పరుగున వాని దగ్గరకు వెళ్ళింది జూజూ. ఈ మనుష్యులు మరీను... తమ పొట్ట సంగతే గాని మరో ప్రాణి గురించి ఆలోచించరే. వాడు తనను చూడనేలేదు. చేతినిండా అదేదో తీసికొని తలవెనక్కి వాల్చి మరీ నోట్లో పోసుకొంటున్నాడు. జూజూ మెల్లగా వానికాలు నాకింది. వాడొక్కసారి కాలు విదిలించేసరికి అంతదూరాన పడింది. వాడొకే పరుగు బెట్టాడు. అక్కసుకొద్దీ శాపనార్థాలు పెట్టసాగింది జూజూ. దగ్గరలోనే శనగపప్పు పొట్లం దుమ్ములో పొర్లాడుతూ కనిపించింది. అయితే దానిని వాడు వదిలిపెట్టి పారిపోయాడన్నమాట! సంతోషంగా తోక ఊపుకొంటూ ఆ పప్పు మ్రింగసాగింది.

ఎక్కడి నుండో ఒక గజ్జికుక్క పిల్ల దానిలో భాగానికి వచ్చింది. జూజూ పళ్ళికిలించి గుర్, గర్ మంటూ దాన్ని ఆ దరిదాపుల్లోలేకుండా తరిమివచ్చింది. ఇంతలో నాలుగు కాకులు కావు కావు మంటూ వచ్చాయి. వాటిపై విరుచుకు పడింది జూజూ. తానెంత కష్టపడి ఆ తిండి సంపాదించింది! తేరగా మెక్కటానికి అందరూ వస్తారు. లోకం పాడయి పోయింది. కష్టపడి సంపాదించుకోలేరుగాని సంపాదించుకొన్న వాళ్ళ దగ్గర దోచుకోటానికి వస్తారు.

ఆ పప్పు పూర్తిగా తిని అలా నడుచుకుంటూ పూరి పాకలవైపు వెళ్ళింది అక్కడ జూజూ మిత్రులు గడ్డిబీట్లో ఆడుకొంటున్నాయి. దీన్ని చూడగా అవన్నీ సాదరంగా ఆహ్వానించాయి.

"చాలా రోజులయింది వచ్చి ఏమిటి కథ" అంది తెల్లమచ్చ ఉన్న గోధుమ వన్నె కుక్క.

"మనబోంట్లకు కథలే ముంటాయి బ్రతుకులు వెళ్ళమారితే చాలు" అని చతికిలబడింది జూజూ.

"నీవూ పేదరుపులు అరుస్తావేమిటోయ్ కలవాళ్ళింటిపొరుగున ఉండీ" అంది తెల్లకుక్క.

"కలవాళ్ల పొరుగున జీవితం మరీ దుర్భరంలేరా. మొన్నంటే మొన్న ఏమయిందను కొన్నావు" అని తన కథ అంతా చెప్పుకొంది జూజూ.

తోటి కుక్కలు సానుభూతి చూపాయి. "ఉన్నవాళ్ళకున్న రోగమే ఇది" అంది తెల్లకుక్క.

"అబ్బో దానికెంత గర్వమనుకొన్నారు" అంది. చెవులూ, తోకా తెగిన కుక్క.

"దాని ఒళ్ళు బలుపు చూశారూ" అంది బక్కకుక్క.

"మనలాంటివాళ్ళతో అసలు కలవదే. దాని మెడకొక పట్టీ. దానిలో తళుక్కుమనే బిళ్ళా. దాని హొయలు చెప్పలేం" అంది నల్లకుక్క.

"ఈ అవమానాన్ని సహించటానికి వీలులేదు. దానికో గుణపాఠం నేర్పాలి. అదీ మన సామర్థ్యం తెలిసికోవాలి."

"ఎంలాభంలేరా, పేదకుక్కకోపం ప్రాణానికి చేటు".

"అలా అనుకొనే అగడాలు ఇన్నాళ్లూ సాగనిచ్చాం. ఇక కుదరదు. బక్కవాళ్ళం ఒక్కటయితే బలిసిన వాళ్ళను లొంగదీయటం ఎంతసేపు."

జూజూకు కూడా అది నిజమనిపించింది. మిగతా కుక్కల్ని ఆ సాయంత్రం తన ఇంటికి ఆహ్వానించింది. సమయం చూసి పగదీర్చుకోవాలని అన్నీ నిర్ణయించుకొన్నాయి.

అసాయంత్రం సంధ్యారుణకాంతులు పెద్దమేడను ముంచెత్తుతూ ఉండగా సీజరు వ్యాహ్యాళికి బయలుదేరింది. దాని వెనుక నౌకరొకడు నడుస్తున్నాడు. ఆ వీధి మలుపు తిరగ్గానే సీజరుపై ఆరు వీధికుక్కలు విరుచుకుపడ్డాయి. నౌకరెంత అదిలించినా లాభం లేకపోయింది. సీజరు క్రింద బడింది. అవి చుట్టుముట్టి కసిదీరా కరిచాయి. కొంతసేపటికి రక్తసిక్తమైన నోళ్ళతో, విజయోత్సాహంతో గుంపుగా అరుచుకొంటూ పారిపొయ్యాయి. ధూళిధూసరితమైన శరీరం నుండి స్రవించే రక్తం సంధ్యారుణ కాంతిలో మరింత అరుణంగా భాసించింది. నౌకరు దాన్ని ఎత్తుకొనేసరికే నిమ్నోన్నతాలు, ఈర్ష్యాసూయలు లేని మరో ప్రపంచం చేరుకొంది సీజరు.

*(జూలై - అగస్టు 1972)*